క్లుప్తంగా

ఎస్వీ వెటర్నరీలో కుల వివక్ష దారుణం

తిరుపతి కల్చరల్: ఎస్వీ వెటర్నరీ కళాశాల డెయిరీ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై కుల వివక్ష చూపడం అత్యంత దారుణమని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ చింతామోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వ పాలనలో దళితులపై హత్యలు, అత్యాచారాలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయన్నారు. ఇందుకు ఎస్వీ వెటర్నరీ కళాశాల పరాకాష్టగా నిలిచిందని తెలిపారు. సెలవుపై వెళ్లి తిరిగి విధులకు హాజరైన ప్రొఫెసర్ చాంబర్‌లో కుర్చీలు, టేబుల్, ఇతర ఫర్నీచర్స్ తొలగించి తీవ్రంగా అవమానించడం అమానుషమన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర నేత హరినాథరెడ్డి

తిరుపతి కల్చరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఐ రాజీలేని పోరాటాలు చేయనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాథరెడ్డి తెలిపారు. తిరుచానూరు భారత కమ్యూనిస్టు పార్టీ 2వ శాఖ మహాసభ ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భూమి కోసం, భుక్తి కోసం పేదల విముక్తి కోసం అనేక పోరాటాలను సీపీఐ చేపట్టి సాధించిందని తెలిపారు. భూ పోరాటాలతో పేదలకు సొంతింటి కల నెరవేర్చిందన్నారు. ప్రస్తుతం వందేళ్లు పూర్తి చేసుకుని శత జయంతి ఉత్సవాలను సీపీఐ నిర్వహిస్తోందని, ఇందులో భాగంగా ప్రతి శాఖ నుంచి జాతీయ కమిటీ వరకు మహాసభలు జరుపుకుని నూతన నాయకత్వాన్ని ఎన్నుకుని రానున్న కాలంలో చేపట్టాల్సిన పోరాట కార్యక్రమాలకు రూపకల్పన చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల నియామకం

తిరుపతి కల్చరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గం సౌత్, వెస్ట్ క్లస్టర్ల పార్టీ కమిటీని నియమించారు. ఇందుకు సంబంధించి ఆదివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. తిరుపతి సౌత్ క్లస్టర్ పార్టీ కమిటీ ఉపాధ్యక్షులుగా దొడ్డి ప్రభాకర్‌రావు, ఇరగం గోపిరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా గుర్రం చిరంజీవి, అరవ నవీన్‌కుమార్, అవుల రమణమూర్తి, కె.మహేష్‌బాబు, కార్యదర్శులుగా చిత్తూరు ఉమాపతి, బచ్చల ప్రకాష్‌రెడ్డి, కత్తి వీరకుమార్, వెనుమండడి భోజరాజు, నీళ్ల రామ్మూర్తి నియమితులయ్యారు. అలాగే సభ్యులుగా మాధవరం రవిచంద్ర, గుమ్మనేని బాలసుబ్రమణ్యం, రాయల లక్ష్మణ్, కె.బాలాజీ, మొలగమూడి నాగయ్య, చెంగల్‌పట్టు భువనను నియమించారు. అలాగే తిరుపతి వెస్ట్ క్లస్టర్ కమిటీ ఉపాధ్యక్షులుగా ఎస్‌కే.ఫరీద్, ఎస్‌జీ సేతుపతి, ప్రధాన కార్యదర్శులుగా సీకే హిట్లర్, సీ.మునికృష్ణ, ఇ.నితిన్, ఎంఎస్.మాధవ్, కార్యదర్శులుగా కె.రాజేశ్వరి, సీ.డిల్లీకృష్ణ, పి.ఉష, నరసింహ, ఉమామహేశ్వరి బ్రహ్మచారి, కమిటీ సభ్యులుగా జె.కల్పన, ఎ.బాబురెడ్డి, జి.భాను, ఎస్‌కే సులేమాన్, బాలాజి, సుబ్రమణ్యం, ఎస్‌డీ ఖాదేవల్లి, హరిప్రసాద్ ఎన్నికయ్యారు.

ఎక్కడేం జరిగినా.. ఇక్కడ నుంచేనా!

- రాష్ట్రంలో జరిగే ప్రతి కార్యక్రమానికి తిరుపతి నుంచి బస్సులను పంపుతున్న అధికారులు
- విశాఖపట్నంలో జరిగే యోగాంధ్రకు జిల్లా నుంచి 30 బస్సులు తరలింపు
- నాలుగురోజులుగా బస్సుల కొరత
- తీవ్ర ఇబ్బంది పడుతున్న జిల్లా ప్రజలు



తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో పల్లెవెలుగు బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

తిరుపతి అర్బన్ : రాష్ట్రంలో ఎక్కడ ఏ కార్యక్రమం జరిగినా.. తిరుపతి నుంచే బస్సులు పంపుతున్నారు. దీంతో స్థానికంగా ఉన్న ప్రజలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. దీంతో కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి ప్రయాణికులకు ఆర్టీసీ బస్సుల కష్టాలు తప్పడం లేదు. నాలుగు రోజులుగా సక్రమంగా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు నానా తిప్పలు పడుతున్నారు. తిరుపతి జిల్లా నుంచి గత బుధవారం అంటే ఈనెల 18న రాత్రి 30 ఆర్టీసీ బస్సులు విశాఖపట్నంకు వెళ్లాయి. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా అక్కడ జరిగే యోగాంధ్ర కార్యక్రమానికి పంపినట్లు అధికారులు వెల్లడించారు. ఇప్పటి వరకు ఆ 30 బస్సులు తిరుపతికి చేరుకోలేదు. ఈ విషయంపై ఆర్టీసీ అధికారులను ఆరా తీయగా ఈ నెల 23 ఉదయం(సోమవారం ఉదయం) తిరుపతికి చేరుకుంటాయని చెబుతున్నారు. నాలుగు రోజులుగా ఆర్టీసీ బస్సుల కొరతతో ప్రయాణికులు గంటల కొద్దీ బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. ముందే పల్లెవెలుగు సర్వీసుల కొరత ఉంది. ఎక్స్‌ప్రెస్‌లు 30 విశాఖపట్నంకు పంపడంతో పల్లెవెలుగు బస్సులను జిల్లాలోని ముఖ్యమైన పట్టణాలకు తిప్పుతున్నారు. దీంతో తిరుపతిలోని పల్లెవెలుగు బస్టాండ్ బస్సులు లేక ఖాళీగా దర్శనమిస్తోంది.

ఆధ్యాత్మిక నగరంలో ప్రయాణికుల ఇక్కట్లు

ఇటీవల పీఎం నరేంద్రమోదీ అమరావతికి వస్తుండడంతో తిరుపతి జిల్లా నుంచి 85 సర్వీసులు పంపించారు. ఆ తర్వాత కడపలో జరిగిన టీడీపీ మహానాడు సమావేశానికి 220 బస్సులను తిరుపతి నుంచి తరలించారు. తాజాగా విశాఖపట్నంలో జరిగిన యోగాంధ్రకు తిరుపతి నుంచి 30 సర్వీసులను నాలుగురోజుల క్రితం పంపించారు. ఇలా రాష్ట్రంలో ఏ కార్యక్రమం చేపట్టినా ముందుగా తిరుపతి నుంచే ఆర్టీసీ బస్సులను పంపేస్తున్నారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతితో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ప్రతిసారి ఆర్టీసీ బస్సులను ఇక్కడే నుంచి పంపుతుండడంపై ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడుతున్నారు.

మానవత్వం చాటుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- తమ వద్ద పని చేసే సిద్ధయ్య పిల్లలను బతికించడానికి తాపత్రయం
- గంటల తరబడి స్విమ్స్‌లోనే నిరీక్షించిన మోహిత్‌రెడ్డి
- అండగా ఉంటానని బాధిత కుటుంబానికి భరోసా

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, తుడా మాజీ చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. తమ వద్ద ప్రైవేటు గన్‌మెన్‌గా పని చేస్తూ సెలవులో ఇంటికి వెళ్లిన సిద్ధయ్య తన జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబంతో కలసి శ్రీవారిని దర్శించుకుని ఇంటికి వెళ్తుండగా పనపాకం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. సిద్ధయ్యతో పాటు ఆయన భార్య కూడా అక్కడికక్కడే మృతి చెందగా పిల్లలు ఇద్దరు అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రుయా ఆసుపత్రికి చేరుకుని ఆ ఇద్దరు పిల్లలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు స్విమ్స్‌కు తరలించారు. అక్కడ కూడా ఆస్పత్రి వైద్యులతో మాట్లాడారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6.30 గంటల వరకు స్విమ్స్ ఆస్పత్రి వద్దే నిరీక్షించారు. ఆ పిల్లలను కాపాడాలన్న తాపత్రయపడుతున్న ఆయనకు పలువురు చేతులెత్తి నమస్కరించారు. అయితే తమ వద్ద పనిచేస్తున్న సిద్ధయ్య, అతని భార్య మృతి చెందడం బాధాకరమైన విషయమని, ఆయన పిల్లలను కాపాడాల్సిన బాధ్యత తమదేనని చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. తమ వద్ద పనిచేసే మరో గన్‌మెన్, పీఏలను ఆస్పత్రిలోనే ఉంచి పర్యవేక్షిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 13 ఏళ్ల బాలుడు గిరి సాయి పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉండడంతో ఇతర ప్రాంతాలకు తరలిస్తామని వైద్యులను కోరగా.. ఇప్పుడు తరలించే పరిస్థితి లేదని చెప్పారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై మెరుగైన వైద్యం అందిస్తున్నారు.



గాయపడిన చిన్నారులు గిరిసాయి, గాయత్రిని స్విమ్స్ ఆస్పత్రికి తరలిస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

నేడు యువతపోరును విజయవంతం చేద్దాం



ఉదయ్‌వంశీ

తిరుపతి మంగళం : యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి యువతను మోసగించిన కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై వైఎస్సార్‌సీపీ చేపడుతున్న యువతపోరును విజయవంతం చేద్దామని ఆ పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌వంశీ పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి సూచనలతో సోమవారం ఉదయం 9.30గంటలకు తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద యువత పోరు కార్యక్రమాన్ని చేపడతామన్నారు. పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయం వద్ద నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టర్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టి, అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు యువత పోరు



కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి

చంద్రగిరి: గత ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి ప్రజలను మోసం చేస్తోందని.. అందులో భాగంగా యువతకు ఇచ్చిన హామీలను విస్మరించడాన్ని నిరసిస్తూ సోమవారం యువత పోరు చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద యువత పోరు కార్యక్రమంలో భాగంగా శాంతియుత నిరసన చేపట్టి, జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి యువత కదలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

ఇద్దరు ఎర్రదొంగల అరెస్ట్



నిందితుల అరెస్టు చూపుతున్న పోలీసులు

తిరుపతి మంగళం: భాకరాపేట-కల్యాణీ డ్యామ్ అటవీ ప్రాంతంలో ఇద్దరు ఎర్రచందనం స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. ఆరు ఎర్రచందనం దుంగలతో పాటు, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్స్ డీఎస్పీ జి.బాలిరెడ్డి ఆధ్వర్యంలో ఆర్ఐ సాయి గిరిధర్కు చెందిన ఏఆర్‌ఎస్ఐ కే.మహేశ్వరనాయుడు టీమ్ శనివారం రాత్రి స్థానిక ఎఫ్‌బీఓ సి.రవితో కలసి నాగపట్ల ఫారెస్టు బీటు పరిధిలో కూంబింగ్ చేపట్టింది. ఆదివారం ఉదయం మోటారు సైకిల్‌పై వెళుతున్న ఇద్దరు వ్యక్తులు పోలీసులను చూపి పారిపోయేందుకు యత్నించారు. వారిని అదుపులోకి తీసుకోగా ఎర్రచందనం పట్టుబడింది. నిందితుల్లో ఒకరు నెల్లూరు జిల్లా, మరొకరు తమిళనాడుకు చెందిన వ్యక్తులుగా గుర్తించారు. నిందితులను తిరుపతిలోని టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



చెంగయ్య ఇంటిలో కాలిపోయిన వస్తువులు

తిరుపతి రూరల్ : మండలంలోని సి.మల్లవరం పంచాయతీ కాలూరు కాలనీలో విశ్రాంత బ్యాంకు ఉద్యోగి వరగంటి చెంగయ్య, వరగంటి చెంగమ్మ ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. వివరాలు.. శనివారం అర్ధరాత్రి సమయంలో ఇంటిలోని ఏసీ విద్యుత్ వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు వ్యాపించాయి. కుటుంబీకులు మంటలను అదుపు చేసేందుకు విఫలయత్నం చేశారు. చుట్టుపక్కల వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో ఫైరింజన్ వచ్చి మంటలను అదుపు చేసింది. అయితే ఇంటిలో విలువైన వస్తువులు కాలిపోయినట్లు బాధితులు వెల్లడించారు. పోలీసులు ఘటనా స్థలం పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు.

గుడిగంటలు మోగకముందే.. గ్లాసులు గలగల!

ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిలో మద్యం మాఫియా రెచ్చిపోతోంది. కూటమి ప్రభుత్వంలో అడ్డదిడ్డంగా మద్యం షాపులు దక్కించుకుని జేబులు నింపుకునే పనిలో పడింది. నిబంధనలకు విరుద్ధంగా మద్యం షాపులకు సమాంతరంగా పర్మిట్లు రూమ్‌లు నడుపుతూ మద్యం తాగిస్తోంది. వేళాపాళా లేకుండానే 24 గంటలూ మద్యాన్ని ఏరులై పారిస్తోంది. గుడి గంటలు మోగకముందే.. గ్లాసులు గలగలమంటూ కదిలిస్తోంది. పవిత్ర పుణ్యక్షేత్రాన్ని అపవిత్రం చేస్తూ.. భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోంది. – సాక్షి ప్రతినిధి, తిరుపతి



హిడస్ పార్క్ వైన్స్ పక్కన ఉన్న పర్మిట్ రూమ్‌లో విచ్చలవిడిగా మద్యం సేవిస్తున్న మందుబాబులు



మద్యంతో పరుగులు తీస్తున్న మందుబాబులతో మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి



బడి మద్యం దుకాణం వద్ద...



సామవాయి రోడ్డులోని మామ వైన్స్ వద్ద..



శివ మద్యం దుకాణం పక్కనే..



జీవ వైన్స్ వద్ద రోడ్డుపైనే మద్యం సేవిస్తూ..



పద్మావతి వైన్స్ పక్కన పర్మిట్ రూమ్‌లో..





తిరుపతిలోని విక్టరీ వైన్స్, జీవకోనలోని రాజీవ్ నగర్ జీవా వైన్స్ వద్ద ఏర్పాటుచేసిన అనధికార పర్మిట్‌రూమ్‌లు



బహిరంగంగానే మద్యం సేవిస్తున్న మందుబాబులు

నోటీస్ బోర్డు

- విద్యార్థులు, యువత పట్ల కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద యువత పోరు నిరసన
- తిరుమల శ్రీవారి ఆలయంలో అంగప్రదక్షిణ టోకెన్లు ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల
- శ్రీవాణి ట్రస్ట్ టిక్కెట్లు ఉదయం 11 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల
- వృద్ధులు, దివ్యాంగులకు తిరుమల శ్రీవారి ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటా మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్ ద్వారా విడుదల
- తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయంలో ఉదయం 10 నుంచి 2 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక, 10.30 నుంచి 11.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం
- జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
- పురోహిత సంఘం ఆధ్వర్యంలో ఇటీవల విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి కపిలతీర్థంలో పిండ ప్రదానం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం
- తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీనివాసం, రైల్వేస్టేషన్ వద్ద ఉన్న విష్ణు నివాసం, అలిపిరి వద్ద ఉన్న భూదేవి కాంప్లెక్‌లో తిరుమలకు శ్రీవారి మెట్లు నడక మార్గంలో వెళ్లే భక్తులకు సాయంత్రం 3.30 నుంచి 4 గంటల వరకు శ్రీవారి ఉచిత దర్శనం టోకెన్లు పంపిణీ

అక్రమ అరెస్టులతో భయపెట్టలేరు

- జరగని లిక్కర్ కేసులో చెవిరెడ్డి అరెస్టు అన్యాయం
- కూటమి ప్రభుత్వానికి ప్రజలే గుణపాఠం చెబుతారు



ఓటేరు నక్కల కాలనీలో గ్రామదేవతకు పూజలు చేస్తున్న స్థానికులు

తిరుపతి రూరల్ : పాతికేళ్లకు పైగా రాజకీయాల్లో తిరుగులేని నాయకుడిగా ఎదుగుతూ పేద ప్రజలకు సేవ చేయడం మాత్రమే తెలిసిన చెవిరెడ్డిని అక్రమ కేసులో ఇరికించి జైలు పాలు చేయడం దారుణమని, ఆయనను తక్షణం విడుదల చేయాలని కోరుతూ చంద్రగిరి నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. తిరుపతి రూరల్ మండలం ఓటేరు పంచాయతీ పరిధిలోని నక్కల కాలనీవాసులు తమ కుల దైవం కరప్ప స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేసి కొబ్బరి కాయలు కొట్టారు. ఓటేరు సర్పంచ్ లక్ష్మి, ఆమె భర్త రాజాతో పాటు కాలనీ వాసులు ఆలయం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీ వాసులు చెవిరెడ్డి ఆరోగ్యం బాగుండాలని కోరుకుంటూ కుల దైవాన్ని ప్రార్థించారు. అదేవిధంగా చెవిరెడ్డి అక్రమ అరెస్టుపై పాకాల మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వంపై ఘాటుగా విమర్శలు చేశారు.

ఇది దుర్మార్గం



కష్టమంటే పరుగెత్తుకుని వచ్చే చెవిరెడ్డిని జైలుకు పంపడం దుర్మార్గం. ప్రజలకు సేవ చేయడంలో ఆయనకు మించిన వారు లేరు. చెవిరెడ్డి అక్రమ అరెస్టుతో చంద్రగిరి ప్రజలు మానసిక వేదనను అనుభవిస్తున్నారు. ప్రజలు తగిన సమయంలో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం చెబుతారు. – లోకనాథం, ఎంపీపీ, పాకాల మండలం

కక్ష సాధింపులో భాగంగానే అరెస్టు..



రాజకీయ కక్ష సాధింపులో భాగమే చెవిరెడ్డి అక్రమ అరెస్టు. ఆయన ఎవరికీ చెడు చేసే వ్యక్తి కాదు. తప్పు చేయాలన్న ఆలోచన ఆయనకు రాదు. దైవ భక్తితో అందరికీ ఆదర్శంగా నిలిచిన చెవిరెడ్డి మీద తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడం దుర్మార్గం. ఆయనను తక్షణమే విడుదల చేయాలి. – భాస్కర్ నాయుడు, రైతు విభాగం అధ్యక్షుడు, పాకాల మండలం

నిరసనలకు కూడా అనుమతించరా?



మా నాయకుడు చెవిరెడ్డిని ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసింది. ఆయన త్వరగా బయటకు రావాలని, ప్రభుత్వం చేసిన దుర్మార్గాన్ని నిరసనలు చేపట్టాలని చూస్తే పోలీసులు నిరసనలకు అనుమతించకుండా అడ్డంకులు సృష్టించడం భావ్యం కాదు. ప్రజాస్వామ్యంలో నిరసలు చేసుకునే హక్కు కూడా లేదా..? – హరిప్రసాద్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేత, పాకాల మండలం

అక్రమ అరెస్టులతో భయపెట్టలేరు



కూటమి ప్రభుత్వం వైఎస్ఆర్‌సీపీలో కీలకంగా పనిచేసే నాయకులపై కక్ష కట్టి అక్రమ అరెస్టులకు పాల్పడుతోంది. అక్రమ అరెస్టులతో తమను భయపెట్టలేరు. జగనన్న సైనికులుగా పనిచేస్తున్న పార్టీ నేతలు, కార్యకర్తలు జైలుకు వెళ్లడానికైనా సిద్ధంగానే ఉన్నారు. ఎన్నో కుట్రలు చేసి చెవిరెడ్డిని జైలుకు పంపారు. ఇది దుర్మార్గం. – నంగా కపిలేశ్వరరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ యువనేత పాకాల మండలం

నూతన వధూవరులకు ఆశీర్వాదం

తిరుపతి మంగళం : తిరుమల సాక్షి టీవీ కెమెరామెన్ ముఖేష్ వివాహానికి చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ డిప్యూటి సీఎం కళత్తూరు నారాయణస్వామి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారితో పాటు పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మెన్ కేతం జయచంద్రారెడ్డి ఉన్నారు.



దంపతులను ఆశీర్వదిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, నారాయణస్వామి